

వరద జోరు.. గోదావరి హోరు

ఎగువన ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి బరాజ్‌ల గేట్లు ఎత్తడంతో కాళేశ్వరం వద్ద గోదావరి నదికి వరద జోరు పెరుగుతోంది. - 8లో▸



నాలుగు గంటలు.. నరకయాతన

ఈదుల పూసపల్లి శివారులోని రాళ్లవాగు వరద ఉధృతిలో కొట్టుకుపోయిన వారు నాలుగు గంటల పాటు నరకయాతన అనుభవించారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $29^0/22^0$

జిల్లాలో ఉదయం అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

ముంచిన ముసురు



● ఈ ఫొటో రాయపర్తి మండలం పెర్కవేడు శివారు పొలాల్లోనిది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటక్షేత్రాల్లో నీళ్లు నిలిచాయి. చెరువులు పొంగి పొర్లుతున్నాయి. పంట పొలాల్లో నీళ్లు నిలిచి చెరువుల్ని తలపిస్తున్నాయి. వర్షం మరో వారం రోజులు ఇలాగే కొనసాగితే పంటలన్నీ పాడవుతాయని, తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – రాయపర్తి



● ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు పూజారి రామలింగం. ఇతడిది పర్వతగిరి మండలం బూరుగుమళ్ల గ్రామం. ఇతడికి 1.14 ఎకరాల భూమి ఉంది. అందులో వరి సాగు చేశాడు. దున్నుడు, వరి నాట్ల కూలి, యూరియా కోసం మొత్తం రూ.30 వేల పెట్టుబడి పెట్టాడు. ఇటీవల భారీగా కురిసిన వర్షాల కారణంగా.. ఊర చెరువు నిండి.. వరద వచ్చింది. పొలమంతా ఇసుక మేటలు వేసి పాడైపోయింది. ఈరైతు పొలంతో పాటు పక్కన ఉన్న మరో 15 ఎకరాల పొలంలో ఇసుక మేటలు నిండిపోయాయి. – పర్వతగిరి



జిల్లాలో కురుస్తున్న వర్షాలు

- నీట మునిగిన పంటలు.
- నేలవాలిన పత్తి, మొక్కజొన్న
- రోడ్లు ధ్వంసం, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- వందల ఎకరాల్లో పంట నష్టం

సాక్షి, వరంగల్: జిల్లాలో వాయుగుండం ప్రభావం కొనసాగుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తమైంది. వరంగల్ నగరంతో పాటు వర్ధన్నపేట, నర్సంపేట పట్టణాల్లో ఆదివారం కురిసిన వానతో రహదారులపై నీరు నిలిచింది. పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటల్లో నిల్చిన నీరును కూడా రైతులు చేతితో పారలు పట్టి కాలువలు తవ్వి బయటకు పోయేలా చూసుకున్నారు. చాలాచోట్ల వర్షంతో పాటు వచ్చిన గాలులకు మొక్కజొన్న, పత్తి పంట నేలపై వాలింది. జిల్లా వ్యవసాయ అధికారులు మాత్రం ఈ వర్షంతో వందల ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

నష్టం ఎక్కడెక్కడంటే..

నెక్కొండ మండలంలో మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో 200 ఎకరాల్లో పత్తి, 70 ఎకరాల్లో వరి, 30 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. చెన్నారావుపేట మండలంలో 250 ఎకరాల్లో పత్తి, 90 ఎకరాల్లో మొక్కజొన్న, 20 ఎకరాల్లో ఇతర పంటలు, దుగ్గొండి మండలంలో 150 ఎకరాలలో పత్తి పంట నష్టం జరిగింది. పర్వతగిరి మండలంలో 150 ఎకరాల్లో పత్తి, వరి దెబ్బతింది. ఇతర మండలాల్లో పత్తి మొక్కల పూత రాలిపోతుండగా.. మొక్కజొన్న, పత్తి పంట నేల వాలినట్లుగా వ్యవసాయ అధికారులు తెలిపారు. వరి పంటల్లో చాలాచోట్ల నీరు వచ్చి చేరిందని, వర్షం ఇలాగే కొనసాగితే పెద్ద ఎత్తున పంటలు దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పెట్టుబడి కూడా వచ్చేలా లేదు..



నేను రెండెకరాల్లో పత్తి సాగు చేశా. 80 రోజుల వయస్సులో ఉన్న చేనుకు పూత, కాత వచ్చింది. గత మూడ్రోజుల వర్షానికి చేనులో నీళ్లు చేరాయి. దీంతో మొక్కలు వాడి చనిపోతున్నాయి. ఇప్పటి వరకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టాను. పంట చేతికి రావడం కష్టంగానే ఉంది. ఈసారి పత్తి ఏపుగా రావడంతో రూ.1.50 లక్షలకు ఢోకా లేదు అనుకున్నా. ఎప్పుడు పెట్టుబడి రాని పరిస్థితి దాపురించింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– శంకేషి మణి, రైతు, దుగ్గొండి మండలం

జిల్లాలో వర్షం ఇలా..

(సోమవారం ఉదయం 8.30 నుంచి రాత్రి ఏడు గంటల వరకు వర్షపాతం మిల్లీమీటర్లలో)

సంగెం	4.3
ఖానాపురం	3.0
గీసుకొండ	2.8
దుగ్గొండి	2.5
నెక్కొండ	2.5
వరంగల్	2.3
ఖిలా వరంగల్	1.8
నల్లబెల్లి	1.5
నర్సంపేట	1.3
చెన్నారావుపేట	1.3
పర్వతగిరి (కల్లెడ)	1
వర్ధన్నపేట	0
రాయపర్తి	0

వర్షాలతో ఎన్పీడీసీఎల్‌కు నష్టం

● వరంగల్ సర్కిల్‌లో 1.20 కోట్లు

హన్మకొండ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు టీజీ ఎన్పీడీసీఎల్‌కు వరంగల్ జిల్లాలో నష్టం వాటిల్లింది. చెట్లు విరిగిపడంతో పాటు, సబ్ స్టేషన్లు మునిగి, పిడుగు పడి, వరదకు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినడంతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్‌లో రూ.1.20 కోట్లు నష్టం జరిగింది. వరంగల్ సర్కిల్‌లో 193 స్తంభాలు, 95 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. సర్కిల్ నోడల్ ఆఫీసర్, సీజీఎం కె.కిషన్, ఎస్ఈ పి.మధుసూదన్ రావు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అంతరాయాలు కలిగిన ప్రాంతానికి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.ఎప్పటికప్పుడు వాతావరణ శాఖ సూచనలు పాటిస్తూ విద్యుత్ సరఫరా మానిటర్ చేస్తున్నామని వివరించారు. విద్యుత్ అంతరాయం, ఇతర సమస్యలుంటే వినియోగదారులు 79016 28362, టోల్ ఫ్రీ నంబర్ 1912, 18004250028 ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

నేలవాలిన మొక్కజొన్న

నర్సంపేట రూరల్: నర్సంపేట మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సోమవారం పలు గ్రామాల్లో వాగులు వంకలు పొంగిపొర్లాయి. మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. అదేవిధంగా పలు గ్రామాల్లో మిర్చి తోటల కోసం వేసి నారు సైతం వర్షాలకు దెబ్బతిని పూర్తిగా నాశనమైంది.



రాజుపేటలో నేలవాలిన మొక్కజొన్న పంట

అతలాకుతలం

రాయపర్తి: భారీ వర్షాలకు జనసందోహం అతలాకుతలమైంది. వరద కారణంగా కాట్రపల్లి, ఊకల్, కొత్తూరు, పెర్కవేడు గ్రామాల్లో రహదారులు కొట్టుకుపోయాయి. ఊకల్, రాయపర్తి, కొత్తూరు, కొండాపురం తదితర గ్రామాల్లో వరిపంటలు కొట్టుకుపోయాయి. ఈక్రమంలో వర్షపు నీరు నిండి పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు సర్వే చేసి నీట మునిగిన పంటలకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



వరద కారణంగా కాట్రపల్లిలో కొట్టుకుపోయిన రోడ్డు



ఖానాపురం: తుంగబంధం కాల్వకు పడిన గండి

- మరిన్ని ఫొటోలు 8లో▸

న్యూస్‌రీల్

ప్రజల గుండెల్లో వైఎస్సార్



గీసుకొండ: దివంగత మహానేత, మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం వైఎస్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ వాహనాలు తదితర ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజలకు ఆరాధ్యుడై నిలిచారన్నారు. మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు వీరగోని రాజ్‌కుమార్, కూసం రమేశ్, జావేద్, నాగరాజు, వజ్ర రాజు, మాజీ సర్పంచ్ బాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి



ప్రమీల(ఫైల్)

దుగ్గొండి: ఫ్యాన్ స్విచ్ వేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి సోమవారం మండలంలోని గుడిమహేశ్వరం గ్రామానికి చెందిన కూరతోట ప్రమీల (60) మృతి చెందింది. గ్రామంలో రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. ఈక్రమంలో సోమవారం సాయంత్రం ప్రమీల ఇంట్లోని ఫ్యాన్ స్విచ్ ఆన్ చేసేందుకు స్విచ్‌బోర్డుపై చెయ్యి పెట్టింది. వర్షాల కారణంగా గోడ తడిసి స్విచ్ బోర్డుకు విద్యుత్ సరఫరా అయ్యి ప్రమీల అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమీల మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఎస్సారెస్పీ కాల్వకు మరమ్మతులు చేయాలి



నల్లబెల్లి: వర్షాలతో ఎస్సారెస్పీ డీబీఎం–38 కాలువకు పడిన బుంగలకు మరమ్మతులు చేపట్టాలని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో డీబీఎం–38 కాల్వకు పడిన బుంగను ఆ పార్టీ నాయకులు సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధిక వర్షాల వల్ల రైతాంగం పెద్ద ఎత్తున నష్టపోయిందన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం ప్రకటించి అందజేయాలన్నారు. వర్షాలతో పాడైపోయిన రోడ్లు, చెరువు కట్టలు, పంట కాలువలకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ బాధ్యులు బాబురావు, కొంరయ్య, రాజాసాహెబ్, నాగరాజు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



శోభన్(ఫైల్)

దుగ్గొండి: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మండలంలోని మహ్మదాపురంలో మత్స్యకారుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన రేగుల శోభన్(45) సోమవారం సాయంత్రం వర్షం తగ్గడంతో దాసరిపల్లి–మహ్మదాపురం గ్రామాల మధ్య ఉన్న చెమ్మి చెరువులో చేపలు పట్టేందుకు 10 మంది మత్స్యకారులతో కలిసి వేటకు వెళ్లాడు. చెరువులో దిగి వలలు వేశారు. చేపలు పట్టడం అయ్యాక బయటికి వచ్చారు. 9 మంది బయటికి వచ్చి శోభన్‌కు త్వరగా రావాలని చెప్పి ఇంటికి వెళ్లారు. అందరూ వచ్చి శోభన్ రాకపోవడంతో భార్య సౌందర్య చెరువు వద్దకు వెళ్లి చూసింది. గట్టున వల ఉంది కానీ మనిషి కానరాకపోవడంతో ఆమె వెతకగా నీటిలో తేలియాడుతూ కనిపించాడు. వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు.

జాగ్రత్తలు పాటించండి

ఎంజీఎం : భారీ వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల్లోని ప్రజలు ఆహారం, తాగునీరు విషయంలో జాగ్రత్తలు పాటించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.లలితాదేవి సూచించారు. సోమవారం నగరంలోని ఏషియన్ శ్రీదేవి మాల్ సమీపంలోని గుడిసెలు, భట్టుపల్లిలోని ఏజీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు.

మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- కోతకు గురైన రోడ్డు, చెరువు కట్ట పరిశీలన



మనుగొండ చెరువు మత్తడిని పరిశీలిస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ: భారీ వర్షాలకు కొంత మేర కొట్టుకుపోయిన మనుగొండ–బాలయ్యపల్లి రోడ్డు, కోతకు గురైన నర్సింహ చెరువు కట్ట మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ట్రాక్టర్ నడుపుకుంటూ రైతులు, అధికారులతో కలిసి సోమవారం దెబ్బతిన్న రోడ్డు, చెరువు కట్టను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు రియాజుద్దీన్, డీఈ సత్యనారాయణ, ఐబీ ఏఈ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు వీరగోని రాజ్‌కుమార్, కొమ్ము శ్రీకాంత్, కూసం రమేశ్, కందికొండ రాజు, రాంబాబు, పాల్గొన్నారు.

ఇబ్బందులు పడకుండా చూడండి

సంగెం: భారీ వర్షాలకు ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. మూడ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సంగెం మండలం ముమ్మడివరం–నార్లవాయి గ్రామాల మధ్య తెగిన తాత్కాలిక రోడ్డును పరిశీలించారు. కాట్రపల్లి–వెంకటాపూర్ గ్రామాల మధ్య లోలేవల్ కాజ్‌వే వద్ద తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో కోనారెడ్డి చెరువు అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- బుంగ పడిన చెరువు పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట: రూ.100కోట్ల నిధులతో కోనారెడ్డి చెరువును అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, అదే విధంగా బండ్ నిర్మాణం తదితర వాటి కోసం మరో రూ.20 కోట్లు నిధుల మంజూరుకు పాటుపడతానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. కోనారెడ్డి చెరువు కట్టకు బుంగ పడి ప్రమాదకరంగా మారిందన్న సమాచారం మేరకు సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి కోనారెడ్డి చెరువును పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట, ఏఈ అమర్‌నాథ్, తహసీల్దార్ విజయసాగర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

జలమయమైన ప్రాంతాల పరిశీలన

భారీ వర్షాలకు వర్ధన్నపేటలోని తహసీల్దార్, పోలీస్ కార్యాలయాలు జలమయం కావడంతో ఆ ప్రాంతాలను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సందర్శించారు. వర్షం నీరు నిల్వకుండా చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో మాట్లాడారు. కొత్తపల్లిలో వర్షానికి కోతకు గురైన రోడ్డును పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అదేవిధంగా ఇల్లంద గ్రామ చెరువు బుంగను పరిశీలించారు.

ఎమ్మెల్యే దొంతి దిష్టిబొమ్మ దహనం



గోవిందాపూర్‌లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు

నల్లబెల్లి: రిజర్వాయర్ పేరుతో గ్రామాలను ముంపునకు గురి చేయవద్దని డిమాండ్ చేస్తూ.. మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో సోమవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మను స్థానికులు, రైతులు దహనం చేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. రంగాయచెరువు రీ డిజైనింగ్ పేరుతో రిజర్వాయర్ ప్రతిపాదన ఆలోచనను ఎమ్మెల్యే దొంతి విరమించుకోవాలన్నారు. తాము పూర్వకాలం నుంచి భూముల్లో పంటలు పండించుకుంటున్నామని, స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. రిజర్వాయర్ పేరుతో తాము ఖాళీ చేసి వెళ్లాలంటే ఎలా? అని వారు ప్రశ్నించారు. చావడానికైనా సిద్ధమే కానీ.. భూములు వదులుకోం అని తేల్చి చెప్పారు. రిజర్వాయర్ ప్రతిపాదన లేదని చెప్పే వరకు తాము పోరాటం చేస్తూనే ఉంటామని వారు హెచ్చరించారు.

రిజర్వాయర్ ప్రతిపాదన చేయలేదు: దొంతి

రంగాయ చెరువును రీడిజైనింగ్ చేసి ఒక టీఎంసీ రిజర్వాయర్‌గా చేయడానికి నిధులు మంజూరు చేయాలని తాను ప్రతిపాదించలేదని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని రుద్రగూడెంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగునీటి సమీక్షలో తాను మాట్లాడిన మాటల్ని బీఆర్ఎస్ నాయకులు వక్రీకరించడం సరికాదన్నారు. గ్రామాలను ముంపునకు గురిచేసి అభివృద్ధి పనులు చేసే ఆలోచన తనకు లేదని వెల్లడించారు. సమావేశంలో నాయకులు పాలాయి శ్రీనివాస్, రంజిత్‌రెడ్డి, చిట్యాల తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, తిరుపతి, భరత్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

● సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న అజిత్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: హనుమకొండ, వరంగల్ జిల్లాలో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 9న సీఎం జిల్లా పర్యటన నేపథ్యంలో.. జిల్లాలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలపై హనుమకొండ కలెక్టరేట్‌లో సంబంధిత శాఖ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'కుడా' ఆధ్వర్యంలో చేపడుతున్న కాళోజీ కళాక్షేత్రం, ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియ, వరంగల్ బస్టాండ్ నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ వ్యవస్థ, స్మార్ట్ సిటీ, ఎయిర్‌పోర్ట్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, వరంగల్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం, తదితర అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. పనుల విషయం ఏమైనా సమస్యలుంటే.. ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే రెండు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ‹కుడా› చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ, నర్సంపేట ఆర్డీఓలు వెంకటేశ్, కృష్ణవేణి, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేశ్‌బాబు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంజీఎం సందర్శన

వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిని సీఎం కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి సోమవారం కలెక్టర్ సత్యశారదతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఔట్, ఇన్ పేషెంట్ తదితర విభాగాలను పరిశీలించి, రోగులకు భోజనం అందించే వంట గదిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందజేస్తున్న వైద్యం, శస్త్రచికిత్సలను ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళిని అడిగారు. నైట్‌డ్యూటీ మహిళ వైద్యులకు రక్షణ కల్పించిన గదులను పరిశీలించి, మహిళ సెక్యూరిటీ గార్డులతో పాటు ప్రత్యేక సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ఆస్పత్రి ప్రాంగణంలో శిథిలావస్థకు చేరుకున్న నర్సింగ్ స్కూల్ భవనాన్ని అజిత్‌రెడ్డి పరిశీలించారు. నర్సింగ్ విద్యార్థులకు రామ్‌కీ అపార్టుమెంట్‌లో వసతి కల్పించినట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు మురళీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వరుడిగా రుద్రేశ్వరుడు

హన్మకొండ కల్చరల్ : నగరంలోని వేయిస్తంభాల దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం రుద్రేశ్వరస్వామిని అర్ధనారీశ్వరుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు గణపతి ఆరాధన, రుద్రేశ్వరుడికి అభిషేకం నిర్వహించారు.

ఆర్టీసీకి రూ.95 లక్షలు నష్టం

హన్మకొండ : భారీ వర్షాలకు వరంగల్ రీజియన్‌లో టీజీఎస్ ఆర్టీసీ రూ.95 లక్షల ఆదాయాన్ని కోల్పోయింది. వాగులు, వంకలు పొంగడంతో అనేక ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో రవాణా వ్యవస్థ చిన్నాభిన్నమై, ఆర్టీసీ బస్సులు నడవలేని పరిస్థితి నెలకొంది. ఆదివారం 208 బస్సులు డిపోలకే పరిమితం కాగా రూ.80 లక్షల ఆదాయం కోల్పోయింది. సోమవారం కూడా 30 బస్సులు నిలిచిపోయాయి. మరికొన్ని బస్సులు పూర్తి రూట్‌లో కాకుండా మధ్య వరకు మాత్రమే నడిపించారు. దీంతో రూ.15 లక్షల ఆదాయం నష్టం వచ్చింది. ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను సంప్రదించి పూర్తి సమాచారం తెలుసుకొని ఇంటి నుంచి బయలు దేరాలని ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయభాను సూచించారు. సమాచారం కోసం వరంగల్ జిల్లా బస్ స్టేషన్ నంబర్ 99592 26057లో సంప్రదించాలని పేర్కొన్నారు.

6న మినీ జాబ్‌మేళా

వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈనెల 6వ తేదీన(శుక్రవారం) ములుగు రోడ్డు సమీపంలోని ఐటీఐ కళాశాలలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో హెచ్‌డీఎఫ్‌సీ, యస్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరాం లైఫ్ ఇన్స్యూ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయన్నారు.

సమగ్ర కుల గణన చేపట్టాలి



ఏఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

నర్సంపేట: రాష్ట్రంలో కుల గణన చేపట్టి ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లలో బీసీలకు 42 శాతం పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు బీసీ కుల సంఘాల నాయకులతో కలిసి సోమవారం ఆర్డీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీలు అత్యధిక జనాభా కలిగి ఉన్నప్పటికీ రాజకీయంగా, ఆర్థికంగా,సామాజికంగా, వెనుకబడిన బీసీలను గుర్తించాలని కోరారు. రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కురిమిళ్ల రమేశ్‌చారి,బండారి సుమంత్, గోపగాని శోభన్‌బాబు, దూపటి సుమన్, బీసీ నాయకులు ఆబోతు రాజుయాదవ్, మచ్చిక రాజుగౌడ్, పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్‌కుమార్ యాదవ్, కార్యదర్శి ఓడపెల్లి రమేశ్, కొమ్ము శ్రీకాంత్, గాండ్ల శ్రీనివాస్, మర్రి క్రాంతికుమార్, కొలిపాక సుధాకర్, మధూరి సుభాశ్‌గౌడ్, బేతి భాస్కర్, శీరంశెట్టి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లి ఉపకేంద్రం పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

చెన్నారావుపేట: వరంగల్ జిల్లా నర్సంపేట చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి 33/11 కేవీ ఉపకేంద్రాన్ని సోమవారం ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పరిశీలించారు. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా మండల పరిధిలో పలు చోట్ల విరిగిన స్తంభాలు, నీటిలో మునిగి దెబ్బతిన్న ఇన్సులేటర్లను ఆయన పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని, ఎక్కడా అంతరాయాలు ఉండకూడదని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్ సామగ్రి సరిపడా అందుబాటులో ఉందని, 24/7 క్షేత్ర స్థాయిలో విద్యుత్ సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. వినియోగదారులు విద్యుత్ విషయంలో జాగ్రత్త వహించాలని, స్తంభాలు, ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోవద్దన్నారు. స్వీయ నియంత్రణ ముఖ్యమని, ఎట్టి పరిస్థితుల్లో స్వయంగా విద్యుత్ మరమ్మతులు చేపట్టరాదని సూచించారు. కార్యక్రమంలో నర్సంపేట డీఈఈ శ్రీధర్, ఏడీఈ లక్ష్మణ్, ఏడీఈ దుర్గం మల్లేశం, ఈఈ జోగానంద్ తదితరులు పాల్గొన్నారు


దోర్నకల్ : ముల్కలపల్లి సమీపంలో పొలాల్లో ఇసుక మేటలు


మహబూబాబాద్: మున్నేరు సమీపంలో నేలవాలిన వరి పంట


ఖానాపురం: పాకాల పరిధిలో వరి పంటలో ఇసుక మేటలు


కురవి శివారులో మిరప తోటలో ఇసుక మేటలు


తాడ్వాయి- పస్రా మధ్య ధ్వంసమైన రోడ్డు

అల్లకల్లోలం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు, మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం అల్లకల్లోలం సృష్టిస్తోంది. ఈ వర్షం ధాటికి గ్రామాల్లో ఇళ్లు నీటమునుగుతున్నాయి. శిథిలావస్థలోని ఇళ్లు కూలుతున్నాయి. కాలనీలు జల ప్రవాహంలో చిక్కుకుంటున్నాయి. రోడ్లు ఎక్కడికక్కడ తెగుతున్నాయి. ఫలితంగా జనజీవనం స్తంభిస్తోంది. పంట పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. - సాక్షి నెట్‌వర్క్


తాడ్వాయిలో కౌలు రైతు బంగారు నర్సమ్మ పొలంలో ఇసుక మేటలు


నర్సింహులపేట: కౌసల్యదేవిపల్లి ఆకేరు బ్రిడ్జి వద్ద వరద ఉధృతికి సగానికి పైగా కోతకు గురైన రోడ్డు


నర్సింహులపేట మండలం రామన్న గూడెంలో ఇసుక మేటగా మారిన పొలాలు


మరిపెడ మండలం పురుషోత్తమయా గూడెం సమీపంలో ధ్వంసమైన 365 జాతీయ రహదారిని పెకిలిస్తున్న జేసీబీ


చిన్నగూడూరు: వరద ఉధృతికి ఆలయాల చుట్టూ తేలిన రాళ్లు


కాటారం: ఇబ్రహీంపల్లిలో కూలిన ఇల్లు


నెల్లికుదురు: వరదతో రావిరాల గ్రామంలో నేలమట్టమైన ఇల్లు


దోర్నకల్: ముల్కలపల్లి వద్ద ఆకేరు వరదలో కొట్టుకుపోయి తేలిన జేసీబీలు, ట్రాక్టర్లు

వరద జోరు.. గోదావరి హోరు


కాళేశ్వరం వద్ద పుష్కరఘాట్‌ను తాకుతూ వెళ్తున్న గోదావరి


సమ్మక్క బరాజ్ వద్ద దిగువకు తరలుతున్న నీరు

- కాళేశ్వరం వద్ద 11.110 మీటర్ల ఎత్తులో నీటిమట్టం
- అన్నారం బరాజ్‌కు 6.87 లక్షలు, మేడిగడ్డకు 8.35 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి నదికి వరద జోరు పెరుగుతోంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువన ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి బరాజ్‌ల గేట్లు ఎత్తడంతో దిగువన గోదావరికి వరద నీరు చేరుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం(సరస్వతి) బరాజ్‌కు భారీగా వరద రాగా, దీనికితోడు పెద్ద వాగుకు వరద పోటెత్తడంతో 6.87 లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. బరాజ్‌లోని మొత్తం 66గేట్లు ఎత్తడంతో ఆ వరద నీరంతా దిగవన కాళేశ్వరం వైపునకు పరుగులు తీస్తోంది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. రెండు నదులు కలిసి కాళేశ్వరం వద్ద పుష్కరఘాట్లను తాకుతూ 11.110 మీటర్ల ఎత్తులో వరద నీరు దిగువకు తరలుతోంది. దీంతో మేడిగడ్డ(లక్ష్మి)బరాజ్ వద్దకు 8.35 లక్షల క్యూసెక్కుల వరద తరలి రాగా, బరాజ్‌లోని మొత్తం 85గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు తరలిస్తున్నారు.

గోదావరి ప్రాంతాల్లో పంట నీటమునక..

భారీ వర్షాల కారణంగా మహదేవపూర్ మండలంలో పత్తి, వరి, మిర్చిపంట నీటమునిగింది. దీనితోడు గోదావరికి వరద ఉప్పొంగడంతో వరదనీరు పరీవాహక ప్రాంతాల్లోని పంటల్లోకి చేరింది. దీంతో ఆయా పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాళేశ్వరం, పూస్కుపల్లి, బెగుళూర్‌లోని కొంగలవాగు ఉధృతంగా ప్రవహించి పంట చేనుల్లోకి నీరు చేరింది. దీంతో పంట నీటమునిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. కానీ వ్యవసాయశాఖ అధికారులు మాత్రం అటు వైపు రాలేదని పేర్కొన్నారు. అధికారులు పంట నష్టం సర్వేచేయాలని కోరుతున్నారు. మహదేవపూర్ మండలంలో ప్రాథమికంగా సుమారు 100 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు.

సమ్మక్క సాగర్ 59 గేట్లు ఎత్తివేత..

కన్నాయిగూడెం : మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ నుంచి సోమవారం 3లక్షల 84వేల 210 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అసిస్టెంట్ ఇంజనీరింగ్ అధికారి సాయిరాం తెలిపారు. మూడు రోజుల నుంచి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో బరాజ్ వద్దకు వరద నీరు పొటెత్తింది. దీంతో అప్రమత్తమైన అధికారులు బరాజ్‌వద్ద ఉన్న ఉన్న 59 గేట్లు ఎత్తివేశారు. కాగా, వరద మరింత వస్తుందని అంచనా వేసిన అధికారులు గేట్లు ఎత్తి ఉంచడంతో వచ్చిన వరద వచ్చినట్లు కిందకు వెళ్తోంది. ప్రస్తుతం బరాజ్ వద్ద నీటి మట్టం 76.70 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. దేవాదుల వద్ద ఉన్న మోటార్లను నిలిపివేశారు. దేవాదులకు కూడా బ్యాక్ వాటర్ వచ్చి చేరుతోంది.

రైళ్ల రద్దు కొనసాగింపు..

- కాజీపేట మీదుగా వెళ్లే 14 రైళ్ల రద్దు
- పలు ట్రైన్ల దారి మళ్లింపు

కాజీపేట రూరల్ : మహబూబాబాద్ జిల్లా ఇంటికన్నె-కేసముద్రం సెక్షన్ ట్రాక్ ఘటనతో సోమవారం రెండో రోజు కూడా దక్షిణ మధ్య రైల్వే అధికారులు పలు రూట్లలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేశారు.

రద్దయిన రైళ్ల వివరాలు

సోమవారం కాజీపేట-డోర్నకల్ (07753) ప్యాసింజర్, ఈ నెల 5వ తేదీన డోర్నకల్-విజయవాడ (07755) ప్యాసింజర్, డోర్నకల్-కాజీపేట (07754) ప్యాసింజర్‌ను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

పార్శల్లీ రద్దు

ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు భద్రాచలంరోడ్-సిర్‌పూర్ టౌన్ (17033) ప్యాసింజర్ భద్రాచలం-కాజీపేట మధ్య రద్దు, ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు సిర్‌పూర్ టౌన్-భద్రాచలంరోడ్(17034) ప్యాసింజర్‌ను కాజీపేట-భద్రాచలం రోడ్ మధ్య రద్దు చేసినట్లు తెలిపారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

కాజీపేట జంక్షన్, నాగపూర్, నడికుడ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే పలు రైళ్లను సోమవారం రైల్వే అధికారులు దారి మళ్లించి నడిపించారు.

రద్దయిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సోమవారం సికింద్రాబాద్-విశాఖపట్నం(22204) ఎక్స్‌ప్రెస్, ఆదిలాబాద్-నాందేడ్ (17409) ఎక్స్‌ప్రెస్, నాందేడ్-ఆదిలాబాద్ (17410) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సిర్‌పూర్‌కాగజ్‌నగర్ (17233) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 3న సిర్‌పూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్(17234), సికింద్రాబాద్-విశాఖపట్నం (20834) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-సికింద్రాబాద్ (20833) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-సికింద్రాబాద్ (20708) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విశాఖపట్నం(20707) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-షాలిమార్(12774) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 4న షాలిమార్-సికింద్రాబాద్ (12773) ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

నాలుగు గంటలు.. నరకయాతన

- రాళ్లవాగులో కొట్టుకుపోయిన డీసీఎం
- నలుగురిని కాపాడిన పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి శివారులోని రాళ్లవాగు వరద ఉధృతిలో ఆదివారం రాత్రి డీసీఎం కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. కాగా, ఈ వాహనంలో ఉన్న ఐదుగురిలో ఒకరు గల్లంతుకాగా నలుగురు సురక్షితంగా బయటకు వచ్చారు. వారంతా నాలుగు గంటల పాటు వరద నీటి ఉధృతిలో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నరకయాతన అనుభవించారు. సంగారెడ్డి జిల్లా మాచునూర్‌కు చెందిన డ్రైవర్ నులక ప్రవీణ్ కుమార్.. హైదరాబాద్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని రిలయన్స్ మార్ట్‌కు డీసీఎంలో సరుకులు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ఈదులపూసపల్లి రాళ్ల వాగు వద్ద వరద ఉధృతి ఎక్కువ ఉందని గ్రామస్తులు తెలుపగా వాహనం అక్కడే నిలిపి ఉంచాడు. కేసముద్రంలో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచిపోగా అందులో ప్రయాణించిన తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన టికీ సునీల్‌కుమార్, అదే మండలం కుతుకులూరుకు చెందిన నక్కిన నాగభూషణం, గుంటూరులోని శ్రీనగర్ కాలనీకి చెందిన వేణుకోటయ్య ప్రైవేట్ వాహనాల ద్వారా ఈదులపూసపల్లికి వచ్చారు. కేసముద్రం గ్రామానికి వెళ్లిన మహబూబాబాద్ పట్టణంలోని మంద కొమురమ్మనగర్‌కు చెందిన దుస్సా దుర్గాప్రసాద్ కూడా ఈదులపూసపల్లికి చేరుకున్నాడు. ఈ నలుగురుతో పాటు డీసీఎం డ్రైవర్ అంతా కలిసి అదే వాహనంలో మహబూబాబాద్‌కు వద్దామని నిర్ణయించుకోగా వరద ఉధృతి తగ్గకపోవడంతో రెండు గంటల పాటు రాళ్లవాగు వద్దే వేచి ఉన్నారు. ఆ సమయంలో గ్రామస్తులు అక్కడే ఉండమని చెప్పారు.


రాళ్లవాగు వరద ఉధృతి నుంచి బయట పడింది వీరే..

కొంత సమయం అక్కడే వేచి ఉండి అనంతరం ప్రయాణం మొదలుపెట్టారు. డీసీఎం కొంతదూరం వచ్చాక వాగు ఉధృతిలో కొట్టుకుపోయింది. అందులో ఉన్న వ్యక్తుల అరుపులు విన్న స్థానికుల సమాచారం మేరకు డీఎస్పీ తిరుపతిరావు, టౌన్, రూరల్ సీఐలు దేవేందర్, సర్వయ్య, రూరల్ ఎస్సై దీపిక, తహసీల్దార్ భగవాన్ రెడ్డి హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. టార్చ్‌లైట్ల వెలుతురుతో పరిశీలించగా కొందరు చెట్టుకొమ్మలను పట్టుకుని ఉన్నట్లు, కొందరు వాహనంలో ఉన్నట్లు గుర్తించారు. ప్రత్యేకంగా జేసీబీ తెప్పించి డీసీఎంలో ఉన్న వ్యక్తుల వద్దకు వైర్లు, రబ్బరు టైర్లు, ట్యూబ్‌లు వదిలారు. మొదట నాగభూషణం ఆ ట్యూబ్ సాయంతో ఒడ్డుకు వచ్చే ప్రయత్నం చేయగా కొంత దూరం వచ్చి వరద ఉధృతిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. అంతలోనే ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పిలిపించగా వారు నాటు పడవతో వరదనీటిలోకి దిగి గంటల కొద్ది కష్టపడి మిగతా నలుగురిని అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో బయటకు తీసుకువచ్చారు. కాగా జరిగిన ఘటనకు బాధ్యుడిగా పేర్కొంటూ డీసీఎం డ్రైవర్ నులక ప్రవీణ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక తెలిపారు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి నీరు


కేసముద్రం స్టేషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

కేసముద్రం: కేసముద్రం- ఇంటికన్నె- తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల పరిధిలో సుమారు 26 చోట్ల రైల్వే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. అమీనాపురం చెరువు మత్తడి పోస్తోంది. ఆ నీరంతా కేసముద్రం స్టేషన్‌లోని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి ప్రవహిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి కల్వర్టు పైవరకు వరదనీరు తాకింది. ఇదే మాదిరి వర్షం ఎక్కువైతే ట్రాక్ కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఈ విధంగా ఇంటికన్నె, కేసముద్రం మధ్య, తాళ్లపూసపల్లి, కేసముద్రం మధ్యలోని కల్వర్టుల వద్ద వరద ఉధృతి పెరిగితే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ట్రాక్ కింద నిలిచిన నీరు

గార్ల: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని గండిచెరువు పక్కన ఉన్న రైల్వేట్రాక్ భారీవర్షాలు కురిస్తే వరద ఉధృతికి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. 10 ఏళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు అలుగు పోస్తుండడంతో గండిచెరువు పక్కన డబ్బాల మోరీ వద్ద రైల్వేట్రాక్ కింద మట్టి, కంకర కొట్టుకుపోయి రైల్వేపట్టాలు నీళ్లలో తేలాయి. దీంతో రైల్వే యంత్రాంగం ఈ ప్రాంతంలో రైల్వేట్రాక్ కింద రాళ్లతో నిర్మాణం చేపట్టి వరదనీరు వెళ్లేందుకు మోరీలు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు కురిస్తే వరదనీరు రైల్వే పట్టాల పైనుంచి వెళ్లే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో గండి చెరువు నిండి 2 నెలల పాటు రైల్వేట్రాక్ కింద 5 ఫీట్ల నీళ్లు నిలిచి ఉంటాయి. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.



డేంజర్.. డేంజర్

వరద నీటితో రైల్వే ట్రాక్‌లకు పొంచి ఉన్న ప్రమాదం


అయ్యప్పటెంపుల్ ఏరియాలో రైల్వేట్రాక్ పక్కన నిలిచిన వరద నీరు


జనగామ: 384 నంబర్ కల్వర్టు వద్ద పిచ్చి మొక్కలతో నిండిన బ్రిడ్జి

జనగామలో రైల్వే ట్రాక్ పక్కనే వరద..

- ఒకే చోట రోజుల తరబడి నీటి నిల్వ

జనగామ: జిల్లా పరిధిలోని రైల్వే ట్రాక్‌కు పెద్ద ప్రమాదం లేకున్నా.. చిన్న చిన్న లోపాలపై దక్షిణ మధ్య రైల్వే అధికారులు దృష్టి సారించడం లేదు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో వరద ఉధృతికి మహబూబాబాద్ జిల్లాలో రైల్వే ట్రాక్ కొట్టుకు పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం 'సాక్షి' జిల్లా పరిధి రైల్వేట్రాక్ ప్రస్తుత పరిస్థితులపై విజిట్ చేసింది. చిన్న చిన్న లోపాలు ఉన్నట్లు గుర్తించింది. జనగామ మండలం పెంబర్తి నుంచి చిల్పూరు మండలం చిన్న పెండ్యాల వరకు జిల్లా పరిధిలో 45 కిలో మీటర్ల మేర రైల్వేట్రాక్ విస్తరించి ఉంది. పెంబర్తి నుంచి జనగామ వరకు 5 కిలోమీటర్ల దూరం. జనగామ నుంచి యశ్వంతాపూర్-6, యశ్వంతాపూర్ నుంచి రఘునాథపల్లి-6, రఘునాథపల్లి నుంచి ఇప్పగూడెం-9, ఇప్పగూడెం నుంచి స్టేషన్‌ఘన్‌పూర్-7, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి నష్కల్-7, నష్కల్ నుంచి చిన్న పెండ్యాల-5 కిలోమీటర్లు ఉంటుంది. జనగామ పట్టణం బాణాపురం సమీపాన 384 కల్వర్టు రైల్వే అండర్ బ్రిడ్జి కింద పిచ్చి మొక్కల కారణంగా రోజుల తరబడి వరద నీరు నిలిచి ఉంటోంది. భారీ వర్షాల నేపథ్యంలో ఎగువ నుంచి వచ్చే వరద ముందుకు వెళ్లలేని సమయంలో ప్రమాదం పొంచి ఉంటుంది. అలాగే, బాణాపురం అయ్యప్ప టెంపుల్ ఎదుట కట్టపక్కన అర కిలోమీటరు మేర నిలిచిన వరద నీరు కుంటను తలపిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు ఎటూ వెళ్లలేక ట్రాక్ కట్టకు ఆనుకుని నిలిచిపోయి.. అందులోనే ఇంకిపోతోంది. పట్టణంలోని పాత బీటు బజారు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్వహణ అధ్వానంగా మారింది. బ్రిడ్జికి మొత్తం ఆరు అండర్ నాలాలు ఉండగా.. పిచ్చి మొక్కలు, చెత్తతో నిండి నీరు రోజుల తరబడి నిలుస్తోంది. వరద ఉధృతి పెరిగిన సమయంలో ఇబ్బందులు తప్పవని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిల్పూరు, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో రైల్వేట్రాక్‌కు ఎలాంటి ప్రమాదం లేదు. ఇప్పగూడెం వద్ద ఈ నెల 1న మధ్యాహ్నం పట్టాలపైకి వచ్చిన కొద్దిపాటి వరద నీరు సాయంత్రానికి తగ్గు ముఖం పట్టింది. రైల్వేట్రాక్ ఎగువ ప్రాంతంలో ఉండడంతో నష్టం జరిగే అవకాశం లేదు.

చెరువులతో కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని ట్రాక్‌కు ప్రమాదం

- అప్రమత్తమైన రైల్వే అధికారులు
- రాత్రి, పగలు పెట్రోలింగ్ ముమ్మరం

కాజీపేట రూరల్: మహబూబాబాద్ జిల్లా తాళ్లపూసపల్లి-ఇంటికన్నె రైల్వే ట్రాక్ ఘటనతో సోమవారం రైల్వే అధికార యంత్రాగం అప్రమత్తమైంది. రైల్వే ట్రాక్ వద్ద గస్తీ మరింత ముమ్మరం చేసి, సమీప చెరువుల వద్ద ప్రమాదాలపై జిల్లా అధికారులకు సమాచారం అందించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో గొలుసుకట్టు చెరువులతో రైల్వే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆయా చెరువులు నిండాయి. మరో రెండు రోజులు ఇలాగే కురిస్తే గొలుసు కట్టు చెరువులు తెగి రైల్వే ట్రాక్ వద్దకు చేరుకుని పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అప్రమత్తమై ఇసుక, కంకర, మట్టి బస్తాలు, మెటీరియల్, సిబ్బందిని అన్ని విధాలా అప్రమత్తం చేసినట్లు వారు తెలిపారు.

ట్రాక్ గస్తీ ముమ్మరం

వడ్డేపల్లి చెరువు వద్ద రైల్వే ట్రాక్ వద్ద వరద నీటి మట్టాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండి పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేశారు. పెండ్యాల, రాజారం చెరువుతో నష్కల్ రైల్వే రోడ్ అండర్ బ్రిడ్జి వద్ద ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే నష్కల్ వద్ద రైల్వే గేట్ నంబర్ 53 వద్ద రోడ్ అండర్ బ్రిడ్జి వద్దకు వరద నీరు చేరి నష్కల్, వంగాలపల్లి గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వంగాలపల్లి రైల్వే సర్వీస్ గేట్ నంబర్ 54లో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఘన్‌పూర్ సమీపంలో ఇప్పగూడ వద్ద రైల్ అండర్ బ్రిడ్జి వద్దకు వరద నీరు చేరింది.


నష్కల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాక్ సమీపానికి చేరిన వరదతో స్తంభించిన రాకపోకలు

గతంలో జరిగిన రైలు ఘటనలు

1954 సెప్టెంబర్ 27న యశ్వంతాపూర్ వాగులో వరద నీటిలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ 4 బోగీలు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 300 మంది మృతి చెందారు. ఈ ఘటనపై నాటి రైల్వే మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రీ రాజీనామా చేశారు. 1987 జూలై 9న మంచిర్యాల వద్ద దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ వరద నీటిలో 14 కోచ్‌లు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 53 మంది మృతి చెందారు. 2005 అక్టోబర్ 29న నల్లగొండ జిల్లా వలిగొండ వద్ద డెల్టా ప్యాసింజర్ వరదలో కొట్టుకుపోయిన ఘటనలో 114 మంది మృతి చెందారు. 200 మందికి గాయాలయ్యాయి.